క్లుప్తంగా

ఘనంగా ఫాదర్స్ డే

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సరోజమ్మ వృద్ధాశ్రమంలో ఫాదర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన దుర్గా స్వీట్స్ యజమాని బిర్రు సుధాకర్ ఆధ్వర్యంలో ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు సరోజమ్మ, సరిత, మాధురి, ప్రకాష్, సాకేత్, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో గురుకుల విద్యార్థుల సత్తా

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన చూపారని కళాశాల ప్రిన్సిపాల్ జానునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో, దమ్మపేట గిరిజన గురుకులం నుంచి ఎస్టీ కేటగిరిలో ఐదుగురు విద్యార్థులకు ఐఐటీ, ఎడుగురు విద్యార్థులకు ఐఐఐటీ, ఎన్ఐటీల్లో అడ్మిషన్ పొందే అవకాశం ఉందని అన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరిలో భూక్యా చంద్రప్రకాష్‌కు 814, తేజావత్ గణేష్‌కు 872, భూక్యా సురేష్‌కు 1230, ఇస్లావత్ గణేష్‌కు 1264, కడవత్ అశోక్‌కు 1401 ర్యాంకులు సాధించారని తెలిపారు.

ఎరువులు అందించండి

ములకలపల్లి: రైతన్నకు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను ప్రభుత్వమే ఉచితంగా అందించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) కల్లూరి కిషోర్ అన్నారు. మండల పరిధిలోని జగన్నాథపురంలో ఆదివారం జరిగిన మండలకమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో, అధిక వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టడంతో రైతులు అప్పులపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకపక్షాలు సకాలంలో పంట కొనడంలేదని, అక్రమంలో దళారులు రంగ ప్రవేశం చేసి తక్కువధరకే పంట కొనుగోలు చేస్తున్నారని అరోపించారు. ఎలకం చలమన్న అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో సంఘ మండల కార్యదర్శి యర్రగొర్ల రామారావు, కారం వెంకటేశ్వర్లు, కన్నారావు, కొప్పుల నాగేశ్వరరావు, పైదా కోటేశ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

దమ్మపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని జిల్లా నాయకులు యార్లగడ్డ భాస్కరరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ మండల సమావేశాన్ని నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ బేషరతుగా అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకృష్ణ, సత్యనారాయణ, జాన్‌బీ, నాగమణి పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న దాసాంజనేయ దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రముఖ పిల్లల వైద్యుడు స్వాతి హాస్పిటల్ డాక్టర్ పిన్నింటి రాజశేఖర్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. స్థానిక డాక్టర్ అనిల్ రెడ్డి పెద్దలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, గ్రామ సర్పంచ్ సరియం రాజమ్మ, పిన్నింటి బాలాజీ,ఆలయ కమిటీ సభ్యులు శ్రీరపు వీర్రాజు, వాకచర్ల బుజ్జి,దల్లి హరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, తాతారావు, నటరాజ్ స్వామి, పిలక వెంకటరమణారెడ్డి, ఆలయ అర్చకులు రాజగోపాల ఆచార్యులు పాల్గొన్నారు.

వీధిలైట్లు అమర్చండి

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని అంబేడ్కర్‌నగర్‌లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రివేళ అంధకారం నెలకొంటోందని, మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పాలకవర్గం, అధికారులు సత్వరమే స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయలని సీపీఎం మండల నాయకుడు పెద్దిని వేణు డిమాండ్ చేశారు. నాయకులు రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, బత్తుల నాగేశ్వరరావు, అబ్దుల్ రహెమాన్, ఆర్ వెంకటాచారి, దాసరి సీతారాములు, వీధివాసులు పాల్గొన్నారు.

బలోపేతం చేయాలి

గుండాల: మండలంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని నియోజకవర్గ పార్టీ నాయకులు వట్టం నారాయణ దొర సూచించారు. ఆదివారం మండలంలోని సాయనపల్లిలో పినపాక నియోజకవర్గ స్థాయి, మండలాల వారీగా టీడీపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఐటీసీ సారపాక అధ్యక్షుడు గల్లా నాగభూషనం, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు హరిప్రసాద్, బూర్గంపాడు మండల అధ్యక్షుడు జగదీష్, కమలాకర్, చందా మధు, తోట వెంకటేశ్వర్లు, ఇల్లందులు నర్సింహులు, ఇల్లందుల అప్పారావు, తోలెం సాంబయ్య, మొల్కం మధు, సమ్మయ్య, బుచ్చయ్య, పార్వతి, చీకటి యాకయ్య పాల్గొన్నారు.

సర్టిఫికెట్లకు తప్పని తిప్పలు

- ఆర్థిక సాయం దరఖాస్తుకు ఒక్క రోజే గడువు
- మొరాయిస్తున్న సర్వర్‌లు
- కార్యాలయాల్లో కుల వృత్తిదారుల పడిగాపులు


మీ సేవ దగ్గర కిక్కిరిసిన దరఖాస్తుదారులు

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాల్లోని కుల, చేతి వృత్తిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించి, దరఖాస్తులు స్వీకరిస్తోంది. కాగా మండలంలోని అర్హులు దరఖాస్తు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, మీ సేవ కేంద్రాల వద్ద పడరానిపాట్లు పడుతున్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 20వ తేదీ వరకే చివరి తేదీ అని ప్రభుత్వం ప్రకటించడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

రోజుల తరబడి ఎదురుచూపులు..

ప్రభుత్వ నుంచి ఆర్థిక సాయం పొందాలంటే ముందుగా బీసీ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, కార్డులో ఉన్న సభ్యుల్లో 18 సంవత్సరాలు నిండిన వారి ఆధార్ కార్డు, కుటుంబ యజమాని బ్యాంకు అకౌంట్, పాన్‌కార్డు అవసరం. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి తహసీల్దార్ కార్యాలయంలో ఇస్తున్నారు. అయితే వారం రోజులు దాటినా సర్టిఫికెట్లు మాత్రం ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో సర్టిఫికెట్ల జారీలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపణలు వస్తుండగా రాష్ట్ర స్థాయిలో సర్వర్ ప్రాబ్లం ఉందని, సైట్ ఓపెన్ కావడం లేదని సంబంధిత అధికార వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ నెల 20న తేదీనే దరఖాస్తుకు చివరి గడువు. ఇక ఒకవైపు సర్టిఫికెట్లు జారీలో జాప్యమవడం, మరోవైపు చివరి తేదీ సమీపిస్తుందడడంతో దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సర్వర్లే సమస్యలా..?!

తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ డౌన్‌తో ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ సాఫీగా సాగడం లేదు. ఒక్కోసారి సర్టిఫికెట్ డౌన్‌లోడ్ కాకపోవడం, మరోసారి సైట్ ఓపెన్ కాకపోవడం, మరోసారి సబ్మిట్ కాకపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి. మూడు రోజులుగా సాయంత్రం అయితే చాలు తహసీల్దార్ కార్యాలయం లాగిన్‌లో సర్టిఫికెట్ మంజూరు చేసినా ఆన్‌లైన్ సెంటర్‌లలో సైట్ ఓపెన్ కావడంలేదు.

దందా షురూ..

బీసీల్లోని పదిహేను కులాలకు ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయం కోసం మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 92 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. మరో ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో దరఖాస్తులు చేయనివారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు త్వరగా వచ్చేలా చూస్తామని, ఇందుకు సర్టిఫికెట్‌కు రూ.వెయ్యి వరకు ఖర్చు అవుతుందని కొందరు బేరసారాలు ఆడుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సమస్య



సర్వర్ ప్రాబ్లం రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. దీంతో సర్టిఫికెట్లు అప్‌లోడ్ అవ్వడం లేదు. మండల వ్యాప్తంగా ఒక్కసారే దరఖాస్తులకు అప్లై చేయడంతో సర్వర్ తీసుకోడానికి కొంచెం సమయం పడుతుంది. దళారులను నమ్మకండి. డబ్బులిస్తే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తామంటే వెంటనే నా దృష్టికి తీసుకురండి.

– మణిధర్, దుమ్ముగూడెం తహసీల్దార్

కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలి

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ వృత్తిదారులకు లక్ష రూపాయలు సాయం పథకం కోసం బీసీలు కుల ధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్లకు కోసం దరఖాస్తులు చేసుకుంటే సర్వర్లు పనిచేయడం లేదంటూ సర్టిఫికెట్లు ఆలస్యంగా ఇస్తున్నారని, అలా జరగకుండా వెంటనే వాటిని అందజేయాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధికారులకు విజ్ఞప్తి చేశారు. పార్టీ 16వ జోన్ కమిటీ సమావేశం డి.సీతాలక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన లక్ష రూపాయల సాయం పథకం దరఖాస్తుకు చివరి తేదీని పొడిగించాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ లక్ష రూపాయల సాయం అందించాలని కోరారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వైవీ రామారావు, నాదేళ్ల లీలావతిలు మాట్లాడారు. ఎంవీఎస్ నారాయణ, కోరాడ శ్రీనివాస్, బేగం, కనక శ్రీ, డి.రామకృష్ణ, రాంబాబు, లక్ష్మీకాంత, హైమావతి, సౌభాగ్యం తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కులు


మాట్లాడుతున్న ఈశ్వరరావు

భద్రాచలంఅర్బన్: ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోగలమని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ యూఈఈయూ) అధ్యక్షుడు ఈశ్వరరావు సూచించారు. భద్రాచలం పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు రెండో రోజుకు చేరాయి. ఆదివారం జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ అనుబంధ యూఈఈయూ సమరశీల పోరాటాలు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన నూతన విద్యుత్ చట్టాన్ని అమల్లోకి రాకుండా పోరాటాల ద్వారా తాత్కాలికంగా అడ్డుకోగలిగామని పేర్కొన్నారు. నూతన విద్యుత్ చట్టం అమల్లోకి వస్తే గృహ వినియోగదారులకు, ఎస్సీ, ఎస్టీ పేదలకు, చిరు వ్యాపారులు, వృత్తిదారులకు చిన్న తరహా పరిశ్రమలకు, వ్యవసాయ రంగానికి ఇస్తున్న రాయితీలు రద్దవుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ ఒప్పందంతో ఆర్టిజన్లు, జూనియర్ లైన్ మెన్లు, అన్‌మ్యాన్డ్ వర్కర్లు, పీస్ రేట్ కార్మికులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి, యూఈఈయూ నాయకులు బొల్లి వెంకటరాజు సత్యం, చంద్రారెడ్డి, ప్రసాదరాజు, ప్రసాద్, అంకిరెడ్డి నర్సింహారావు, దిలం శ్రీను, కూనరాజు, వర్మ, లీలావతి పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

దమ్మపేట: మండల పరిధిలోని దమ్మపేట గ్రామంలో ఓ యువతి అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట గ్రామానికి చెందిన ఓ యువతి ఈ నెల 16వ తేదీన డిగ్రీ సెకండ్ ఇయర్ సెమిస్టర్ పరీక్షలు రాయడానికి అశ్వారావుపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీకి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆమె తండ్రి ఫోన్ చేశాడు. అయినప్పటికీ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎక్కడ వెతికినా ఆమె అచూకీ లభించలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

దమ్మపేట: మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమల్లో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితుల సమక్షంలో ముత్యాలమ్మకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ


మంత్రి సత్యవతిరాథోడ్ నుంచి ప్రశంసా పత్రాలు పొందిన ప్రధానోపాధ్యాయులు..

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన గిరిజనోత్సవంలో మండల పరిధిలోని పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించిన గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన గిరిజన బాలికల కళాశాల విద్యార్థులను రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. శనివారం గిరిజనోత్సవంలో మండల పరిధిలోని గొల్లగూడెం, అంకంపాలెం, పార్కలగండి ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, ధర్మాలు గిరిజన శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. మండలంలోని అంకంపాలెం గిరిజన బాలికల కళాశాల విద్యార్థినులు నిరీక్షణ, గంగోత్రిలు ప్రశంసా పత్రాలతో పాటుగా రూ.15 వేల నగదును మంత్రి చేతుల మీదుగా అందుకున్నారు.

'రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్రా'కు విరాళం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన పట్టణ ప్రముఖులు పీవీ రామారావు ఆదివారం సారపాక ఐటీసీ కర్మాగారం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రాకు రూ.50 వేలు విలువగల చెక్‌ను విరాళంగా ఆ క్లబ్ కార్యదర్శి డాక్టర్ విజయ్‌కు అందించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. విరాళంగా వచ్చిన ఈ మొత్తాన్ని స్థానికంగా ఉన్న విద్యార్థినులు నివసిస్తున్న ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించనున్నట్లు తెలిపారు. సహకరిస్తున్న దాతలకు విజయ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సారపాక రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సభ్యులు మరడాన శ్రీనివాస రావు, సాయి రామ్, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీ పరిధి వలసగొత్తికోయ గ్రామమైన విప్పలగుంపుకు చెందిన నిరుపేద ఆదివాసీ గిరిజనులకు చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ తాటి సావిత్రి చేతుల మీదుగా ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పంచాయతీ కార్యదర్శి మణికిరణ్, సభ్యులు కమల్‌హాసన్, ఫిరోజ్, మాజీ సర్పంచ్ తాటి బిక్షం పాల్గొన్నారు.

క్విజ్ పోటీల బ్రోచర్లు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూలై 2న నిర్వహించే ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆదివారం జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యడారి ప్రదీప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన యూత్ డిక్లరేషన్ 2023కి స్ఫూర్తిగా నిర్వహిస్తున్న ఈ ఆన్‌లైన్ క్విజ్ పోటీలలో భద్రాచలం డివిజన్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చింతిరాల సుదీర్ కుమార్, మణికంఠ, రాంప్రసాద్, నాగరాజు, నవీన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక 'చేయూత'

బూర్గంపాడు: లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొడ్డు అంజిరెడ్డి అనే యువకుడు ఇటీవల తాటిచెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. అతనికి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించారు. ఇందుకోసం 8లక్షల రూపాయలకు పైగా ఖర్చుచేశారు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆదివారం అంజిరెడ్డి వైద్య ఖర్చులకు రూ.11వేల ఆర్థికసాయమందించారు. ఏఎస్సై వైవీ సత్యనారాయణ, ట్రస్ట్ అధ్యక్షుడు కై పు లక్ష్మీనారాయణరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు జె.మల్లారెడ్డి, కె.నాగిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, కె.బాలఅచ్చిరెడ్డి, సాయిబాబా, హనీఫ్, బి.వెంకట్రామిరెడ్డి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎం.వెంకటరమణారెడ్డి, ఎస్.మల్లేష్, మూల లక్ష్మీరెడ్డి, జి.నర్సిరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


సమస్య పరిష్కారం కోసం ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు

చర్ల: మండలంలోని కలివేరులో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఆదివారం కలివేరులో రాస్తారోకో నిర్వహించారు. చర్ల–భద్రాచలం ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ఆందోళనలకు దిగిన గ్రామస్తులు.. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించడంతో సమాచారం అందుకున్న చర్ల పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ రవి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. సంబంధిత మిషన్ భగీరథ అధికారులతో ఫోన్‌లో మాట్లాడడంతో మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నాటు తుపాకులు ఉపయోగించడం నేరం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవేంద్రరావు

మణుగూరురూరల్: నాటుతుపాకులను, పేలుడు పదార్థాలను ఉపయోగించడం చట్టరీత్యా నేరమని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు తెలిపారు. ఆదివారం సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ మండల సర్పంచ్‌లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటుతుపాకులు, పేలుడు పదార్థాలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే పోలీస్ వారికి అప్పజెప్పాలన్నారు. తనిఖీలు నిర్వహించినప్పుడు అవి దొరికితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మణుగూరు సీఐ ముత్యం రమేష్, ఎస్సై రాజ్‌కుమార్, సర్పంచ్‌లు బచ్చల భారతి, బొగ్గం రజిత, కొమరం జంపేశ్వరి, తాటి సావిత్రి, కృష్ణవేణి, జగిడి జ్యోతి, కాయం తిరుపతమ్మ, పాల్వంచ ఈశ్వరమ్మ, ఏనిక ప్రసాద్, కారం ముత్తయ్య, బాడిశ సతీష్, కుర్సం రాంబాబు, తాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వేకు సహకరించాలి


సారపాకలో ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ భగవాన్‌రెడ్డి

బూర్గంపాడు: ఓటర్లందరూ ఇంటింటికీ ఓటరు సర్వేకు సహకరించాలని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి కోరారు. సారపాకలో ఆదివారం నిర్వహించిన ఇంటింటి ఓటరు సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండి ఓటుహక్కు లేనివారు ఫారం–6లో పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్, కుటుంబ సభ్యుల్లో ఒకరి ఓటర్ ఐడీ జిరాక్స్ జతపరచి సర్వే టీమ్‌లకు అందించాలన్నారు. ఓటు హక్కు ఇతర ప్రాంతాల్లో ఉండి ప్రస్తుతం నివాసం ఉండే చోటుకు మార్చుకునేందుకు ఫారం–8లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటుహక్కు కలిగిన కుటుంబ సభ్యులు ఎవరైనా మృతిచెందివుంటే డెత్ సర్టిఫికెట్ జిరాక్స్‌ను సర్వేటీమ్‌లకు అందించి తొలగించుకోవాలని సూచించారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

బూర్గంపాడు: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి ముప్వ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం సారపాకలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులకు 8 కోట్ల రూపాయల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సొంత ఖర్చులతో విద్యార్థుల కడుపు నింపుతున్న మధ్యాహ్న భోజన వర్కర్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కేరళ ప్రభుత్వం మధ్యాహ్న భోజన వర్కర్లకు రోజుకు రూ.600వేతనం చెల్లిస్తుంటే మన ప్రభుత్వం కేవలం రూ.33 చెల్లిస్తోందన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను పరిగణనలోకి తీసుకుని మధ్యాహ్న భోజన వర్కర్లకు బిల్లులు పెంచాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా నాయకులు పేరాల శ్రీనివాస్, ఏఐటీయూసీ అధ్యక్షుడు సాజిత్, జహీర్, ఆకుల పద్మ, రమాదేవి, రాధా, లక్ష్మీపుష్ప, సత్యవతి, ఈశ్వరి, సరిత, రజని, పిచ్చమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగికి సన్మానం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏరియా ఉత్తమ ఉద్యోగిగా అవార్డ్ అందుకున్న ఎస్అండ్‌పీసీ ఉద్యోగి బండారు జయరాజును సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పీవీకాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. తొలుత సంఘ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమా వేసి ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, ఏరియా ఉపాధ్యక్షుడు శనిగరపు కుమారస్వామి, సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కాజీపేట కృష్ణ, ఏరియా లైజన్ అధికారి ఎం.నరసింహరావు, బ్రాంచ్ కార్యదర్శులు మధుబాబు, పాపారావు, ఏరియా చీఫ్ ఆర్గనైజర్ దాట్ల సందీప్‌కుమార్, సహాయ కార్యదర్శులు గంగాధర్, కిషోర్‌బాబు, కమిటీ సభ్యులు అశోక్ కుమార్, ప్రమోద్, చంద్రశేఖర్, కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మంచినీళ్ల పండుగ

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగను చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ నాయకత్వంలో పంచాయతీల ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకుల వద్ద మామిడి అలంకరణలు చేశారు. ముగ్గులు వేసి కార్యక్రమాలు నిర్వహించారు. నీటిని పొదుపుగా వాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ అందుతున్న తాగునీటి వనరులపై కొన్ని చోట్ల ఫొటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో పనిచేసే కార్మికులను అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్


బూర్గంపాడు: మోతె పట్టీనగర్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న వృద్ధురాలు


చంద్రుగొండ: తిప్పనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


గుండాల: వివిధ రకాల నీళ్లను పరీక్షిస్తున్న భగీరథ అధికారులు


అశ్వాపురం: ర్యాలీలో ఎంపీపీ సుజాత, సర్పంచ్ శారద, ఉపసర్పంచ్ చందూలాల్


చర్ల: భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా తీరును వివరిస్తున్న ఏఈ రాము


దమ్మపేట: గోపాలపురంలో వాటర్ ట్యాంక్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు


భద్రాచలంఅర్బన్: మాట్లాడుతున్న మిషన్ భగీరథ అధికారి శ్రీనివాసరావు


అన్నపురెడ్డిపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న గుంపెన పీఏసీఎస్ చైర్మన్ బోయినపల్లి సుధాకర్


మణుగూరురూరల్: సభలో మాట్లాడుతున్న సమితిసింగారం సర్పంచ్ బచ్చల భారతి